గోదావరి జలాలతో బిక్కేరు పరీవాహకం సస్యశ్యామలం

• తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

బిక్కేరు వాగులో గోదావరి జలాలకు పూజలు చేసి పూలు వదులుతున్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, అక్టోబర్ 8 : గోదావరి జలాలతో మోత్కూరు, అడ్డగూడూరు మండలాల పరిధిలోని బిక్కేరు పరీవాహక ప్రాంతమంతా సస్యశ్యామలం కానుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలోని బిక్కేరు వాగులో పారుతున్న జలాలకు మంగళవారం ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు మండలాలకు చెందిన పలు గ్రామాల రైతులు బిక్కేరులో వేసుకున్న పిల్టర్ పాయింట్ల (చేతి బోర్ల) ద్వారా వరి సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రతి ఎకరాకు సాగునీటి వసతి కల్పించేందుకు తమ ప్రభుత్వం పని చేస్తుందని, రైతుల శ్రేయస్సు కోసం పాటుపడుతుందని పేర్కొన్నారు. పురోహితులు పారునంది సూరిబాబుశర్మ జల పూజ మంత్రోచ్చారణ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, నాయకులు పైళ్ల సోమిరెడ్డి, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.5లక్షల చెక్కు అందజేత

అడ్డగూడూరు : ఇటీవల కురిసిన వర్షానికి మండలంలోని మానాయికుంట గ్రామంలో బోడ అవిలమ్మ కాల్వలో పడి మృతిచెందింది. వరద బాధితుల సహాయం కింద ప్రభుత్వం మంజూరు చేసిన 5లక్షల రూపాయల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే మందుల సామేల్ ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన ననుబోతు లక్ష్మి ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పోలెబోయిన లింగయ్యయాదవ్, సింగిల్‌విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, నాయకులు చిరంజీవి, శ్రీశైలం ఉన్నారు.

సతీశ్ కుటుంబానికి అండగా ఉంటాం : మాజీ ఎమ్మెల్యే కిశోర్



సతీశ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

అడ్డగూడూరు, అక్టోబర్ 8 : మండలంలోని వెల్దేవి గ్రామానికి చెందిన పిల్లి సతీశ్ (22) ఇటీవల డెంగ్యూతో మృతి చెందాడు. మంగళవారం ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, నాయకులు పొన్నాల వెంకటేశ్వర్లు, తీపిరెడ్డి మేఘారెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, పూలపల్లి జనార్దన్‌రెడ్డి, బట్ట వెంకటయ్య పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు

గ్రామ వ్యవసాయ పటాన్ని చూపెడుతున్న విద్యార్థినులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 8 : రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ నరేందర్‌రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని వీరవల్లి గ్రామంలో మంగళవారం గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు, చీడపీడల నివారణ పద్ధతులు, వ్యవసాయంలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారాలు, అధిక దిగుబడికి పాటించవలసిన మెళకువలను రైతులకు వివరించారు. అనంతరం గ్రామ అభ్యుదయ రైతులను సత్కరించారు. కార్యక్రమంలో రావెప్ ఇన్‌చార్జి నిర్మల, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కె.మమత, వీరవల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, అభ్యుదయ రైతులు కంచి మల్లయ్య, చింతల సురేందర్‌రెడ్డి, సురవరం చంద్రశేఖర్‌రెడ్డి, రేగు మహేశ్, సురుగు మహేశ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే ప్రీ పరేడ్‌కు డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక

లింగస్వామి

రామన్నపేట, అక్టోబర్ 8 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపీసీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న లింగస్వామి నవంబర్ 12నుంచి 21వరకు మహారాష్ట్రలో జరుగనున్న ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రహత్‌ఖానం తెలిపారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ నలగొండ ఎన్ఎస్ఎస్ సెల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి ఆధ్వర్యంలో ఈ ఎంపిక పోటీలు జరిగాయని ఆమె తెలిపారు. ఎంపిక పట్ల అధ్యాపకులు, విద్యార్థిని అభినందించారు.

వైన్స్‌లో చోరీ

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 8 : మండలంలోని సునీత వైన్స్‌లో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. వైన్స్ పైకప్పు రేకులను తొలగించి లోపలికి దిగి సీసీ కెమెరాల సామగ్రిని తొలగించి రూ.27వేల నగదు, రూ.40వేల విలువైన మద్యం బాటిళ్లను చోరీ చేశారని వైన్స్ నిర్వాహకులు తెలిపారు. వైన్స్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

బాలాజీ క్రషర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

బాలాజీ క్రషర్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

బొమ్మలరామారం, అక్టోబర్ 8 : మండలంలోని మర్యాల గ్రామ పరిధిలోని క్రషర్ యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి పాండు అన్నారు. క్రషర్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం క్రషర్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రషర్ నుంచి వెలువడుతున్న దుమ్ము వల్ల సమీప రైతుల వరి పొలాలు, కూరగాయల పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. లారీలు అధిక లోడుతో వెళ్తున్నందున రోడ్లు గుంతలమయంగా మారి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మైనింగ్ అధికారులు ఇచ్చిన అనుమతులను మించి భారీ స్థాయిలో బ్లాస్టింగ్ చేయడం వల్ల ఇండ్లకు బీటలు వారడం, బోరు మోటార్లు కూలిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి క్రషర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, గ్రామ కార్యదర్శి ముద్దం మధుసూధన్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ, దేవేందర్, వెంకటేశ్, రాములు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి నిత్య తిరుకల్యాణోత్సవం

స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. స్వామివారి కల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించారు. స్వామివారిని గరుడ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. స్వామివారికి దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి ప్రధానాలయం ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన జరిగాయి. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 11వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.19,15,244 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్ రావు తెలిపారు.

స్వర్ణగిరిలో ధాన్యలక్ష్మిగా పద్మావతీదేవి

ధాన్యలక్ష్మి అవతారంలో అమ్మవారికి హవనం నిర్వహిస్తున్న అర్చకులు

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : స్వర్ణగిరి క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం పద్మావతీ అమ్మవారు ధాన్యలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అర్చకులు అమ్మవారికి హవనం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఉదయం ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను నిర్వహించారు. వేంకటేశ్వర స్వామికి వేయి నామాలను స్తుతిస్తూ సహస్రనామార్చన చేపట్టారు. మధ్యాహ్నం పద్మావతీ గోదాదేవీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సుమారు 3200 మందికి పైగా భక్తులకు నిత్యాన్నప్రసాదాన్ని అందించారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా హనీఫ్ అహ్మద్

హనీఫ్ అహ్మద్

వలిగొండ, అక్టోబర్ 8 : ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ టీఎస్) అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడిగా మండలంలోని వర్కట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు హనీఫ్ అహ్మద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించిన పీఆర్‌టీయూ 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో తనను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమరేందర్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు పసల విజయానంద్, సోమ్లానాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎం మండల కార్యదర్శిగా వెంకటనర్సు

మోత్కూరు, అక్టోబర్ 8 : సీపీఎం మండల కార్యదర్శిగా మండలంలోని పాలడుగు గ్రామానికి చెందిన గుండు వెంకటనర్సు మూడోసారి ఎన్నికయ్యారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ సమక్షంలో మంగళవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటనర్సు మాట్లాడుతూ ప్రజలందరి మద్దతుతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీ బలోపేతం కోసం పాటుపడుతానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కల్లూరి మల్లేశం, బొల్లు యాదగిరి పాల్గొన్నారు.

బిక్కేరు వాగులోకి గోదావరి నీరు కేసీఆర్ కృషి ఫలితమే

• మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మందడి రామకృష్ణారెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మందడి రామకృష్ణారెడ్డి

గుండాల, అక్టోబర్ 8 : మండలానికి నేడు గోదావరి జలాలు రావడం కేసీఆర్ పుణ్యమే అని మోత్కూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మందడి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి జలాలను తామే తీసుకొచ్చినట్లు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి సాగునీరు అందించేందుకు ఎంతగానో కృషి చేశారని గుర్తుచేశారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపురం, గంధమల్ల ప్రాజెక్టుల ద్వారా ఆలేరు నియోజకవర్గానికి సాగునీరు అందుతుందని తెలిపారు. ఎస్సారెస్పీ నుంచి లిఫ్టు చేసిన నీరు ఆలేరు బిక్కేరు వాగుకు వస్తుందని బీర్ల ఐలయ్య మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాళేశ్వరం నీరే గుండాల వరకు అందుతుందని, గతంలో బీఆర్ఎస్ హయాంలో 7 సార్లు నీటిని విడుదల చేశారని, మూడు సార్లు పూర్తి స్థాయిలో మండలంలోని అన్ని చెరువులు నింపారని తెలిపారు. 8వ సారి వచ్చి తామే అంతా చేశామనడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రాజెక్టుకైనా నిధులు కేటాయించి పనులు చేశారా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫెయిల్ అయితే ఇప్పుడు వచ్చే వరదను ఎలా తట్టుకుంటుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ వల్లే గుండాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. మాజీ జడ్పీటీసీ గడ్డమీది పాండరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. సగం మంది రైతులకు రుణమాఫీ చేయకుండా అంతా పూర్తయిందని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. సన్న వడ్లకే బోనస్ ఇస్తామనడం, రైతుబంధు ఇవ్వకపోవడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, నాయకులు బొంగు శ్రీశైలం, కోలుకొండ రాములు, బండారు శ్రీనివాస్, పూర్ణచందర్, రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, రాంమల్లు, రంగారెడ్డి, రమేశ్, శ్రీనివాస్, రాజు, సాయి, రమేశ్ పాల్గొన్నారు.

సూరోజు తిరుపతయ్య శత జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక

తిరుపతయ్య శత జయంతి ఉత్సవ నిర్వహణ కార్యవర్గ సభ్యులు

మోత్కూరు, అక్టోబర్ 8 : మున్సిపాలిటీకి చెందిన విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు సూరోజు తిరుపతయ్య శత జయంతి ఉత్సవ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, అధ్యక్షుడిగా అభినయ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మర్రి జయశ్రీ, ఎండీ జానీ, బుస్స రవి, బోళ్ల హనుమంతు, ప్రధాన కార్యదర్శిగా దేవినేని అరవిందరాయుడు, కార్యదర్శులుగా మోత్కూరి బ్రహ్మచారి, కె.మహేందర్, గొడిశాల జ్యోతి, ఆవుల వెంకటేశ్వర్లుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. డిసెంబర్‌లో తిరుపతయ్య శత జయంతి ఉత్సవాలను నిర్వహించడంతోపాటు ఆయన విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాభారతి, అభినయ కాళాసమితి సభ్యులు, కుటుంబ సభ్యులు భాస్కరాచారి, రాములు, మంజుల, యాదమ్మ, జయప్రకాశ్ పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

54 కిలోల సరుకు పట్టివేత

స్వాధీనం చేసుకున్న గంజాయి బ్యాగులు

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 8 : గంజాయి తరలిస్తున్న మహారాష్ట్ర ముఠాను మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు భువనగిరి ఎస్ఓటీ టీమ్‌తో కలిసి చౌటుప్పల్ పోలీసులు పంతంగి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా దూగావ్ గ్రామానికి చెందిన ప్రకాశ్ ధనేశ్వర్ (24), అహ్మదానగర్ జిల్లా కన్‌కూరి గ్రామానికి చెందిన నవనాత్ బావన్ (34), పూణె జిల్లా శీరూర్ తాలుకా వేరుదేగనాగవ్ గ్రామానికి చెందిన ధర్మా ఆర్రోభా తోరూర్ (50) 54కిలోల గంజాయిని కారులో తరలిస్తుండగా పంతంగి టోల్‌గేటు వద్ద పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి.. కారు, నాలుగు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. విచారణ తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.

ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో బతుకమ్మ సంబురాలు

భూదాన్ పోచంపల్లిలో : బతుకమ్మ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

ఆలేరు టౌన్, అక్టోబర్ 8 : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం దసరా పూజ, ఆసుపత్రి ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు బతుకమ్మ ఆడిపాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ జె.స్వప్న రాథోడ్, డాక్టర్లు ప్రసాద్‌రావు, వెంకటశీర్షి, రజని, స్వప్న, గణేశ్, నర్సులు మంజుల, సుజాత, అనిత, ఒస్‌మెల, సమీనా, మమత, కాటమయ్య, సుమ, ఇందిర, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోటకొండూరు పీహెచ్‌సీలో..

మోటకొండూర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ విజయ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ యశోద బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పీహెచ్‌సీలో ఆడిపాడారు. కార్యక్రమంలో డీఐఓ రామకృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని, వైద్య సిబ్బంది సత్యవతి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, శివాని, హారిక, పార్వతమ్మ, నర్సింహ, సుగుణ పాల్గొన్నారు.

ఆలేరు టౌన్ : పట్టణంలోని ఎస్ఆర్‌కేవీ విద్యాలయంలో జనం టీవీ ఆధ్వరంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలయ్య సతీమణి బీర్ల అనిత మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. వేడుకల్లో మహిళా నాయకులు నీలం పద్మ, గుత్తా శమంతారెడ్డి, జాలపు వనజ, గడ్డం విజయ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పిలుపు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఒంటరి మహిళలు పాల్గొన్నారు. చౌరస్తాలో బతుకమ్మలను ఉంచి ఆడిపాడారు. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, ఒంటరి మహిళలు, పిలుపు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో..

భూదాన్ పోచంపల్లి : పట్టణంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయం ఎదుట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా అలంకరించి ఆడిపాడారు. కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, కౌన్సిలర్లు సామల మల్లారెడ్డి, దేవరాయకుమార్, కొంగరి కృష్ణ, కర్నాటి రవీందర్, గుండు మధు, పెద్దల చక్రపాణి, బోగ భానుమతి, కుడికాల అఖిల, దారెడ్డి మంజుల, మహిళా సంఘాల ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.

ఆలేరు టౌన్ : ఎస్ఆర్‌కేవీ విద్యాలయంలో..

ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో బతుకమ్మ పూజలో వైద్యులు, సిబ్బంది

బీజేపీ పాలనలోనే మహిళలపై దాడులు

• ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

మహాసభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

భువనగిరి అర్బన్, అక్టోబర్ 8 : కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే మహిళలపై దాడులు అధికంగా జరుగుతున్నాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి అన్నారు. పట్టణంలోని ఉద్యోగుల భవనంలో మంగళవారం నిర్వహించిన ఐద్వా 3వ మహాసభలో ఆమె మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన హామీ నేటికీ నెరవేర్చలేదన్నారు. పైగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. మహిళలకు ఇస్తానన్న రూ.2500, గ్యాస్ సబ్సిడీ అమలు చేయలేదని విమర్శించారు. మహిళలు మల్లు స్వరాజ్యం, చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాటాలకు కదలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనూరాధ, ఉపాధ్యక్షురాలు దోనూరు నిర్మల, సహాయ కార్యదర్శి మల్లెపల్లి లలిత, కోశాధికారి కల్లూరి నాగమణి, నాయకులు బత్తుల జయమ్మ, కేసురెడ్డి జయమ్మ, వసంత పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో ఈజీఎస్ అమలు చేయాలి

• సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

మోత్కూరు, అక్టోబర్ 8 : మున్సిపాలిటీల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీలో మంగళవారం నిర్వహించిన సీపీఎం పట్టణ రెండో మహాసభలో ఆయన మాట్లాడారు. కేరళ రాష్ట్రంలోని మున్సిపాలిటీ ప్రాంతాల్లో ఈజీఎస్ అమలు చేస్తున్నాన్నారు. మన రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మున్సిపాలిటీల ఏర్పాటు కోసం అనేక గ్రామాలను విలీనం చేశారని, దాంతో విలీన గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోని పేదలు ఉపాధి హామీ పనులకు నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశ్, జిల్లా నాయకుడు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు యాదిరిఎడ్డి, రాములు, అంజయ్య, కృష్ణారెడ్డి, రాములమ్మ పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే సామేల్ క్షమాపణ చెప్పాలి

మోత్కూరు, అక్టోబర్ 8 : కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు అదే కాళేశ్వరం ద్వారా వస్తున్న నీళ్లకు జల పూజలు చేసిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి అన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పదవుల కోసం పరితపించే నాయకులు పాలకులైతే ప్రజల పరిస్థితి ఇలాగే ఉంటుందన్నారు. తుంగతుర్తి ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకొచ్చేందుకు కేసీఆర్‌తోపాటు మాజీ ఎ